సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 14 । మార్చి । 2024



వైభవం..ధ్వజావరోహణం

రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజావరోహణం వైభవంగా నిర్వహించారు.

-8లో

రంజాన్ వేళలు

		ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
రాయచోటి	:	6.29	5.06
రాజంపేట	:	6.30	5.06
పీలేరు	:	6.31	5.02
మదనపల్లె	:	6.31	5.10

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.250
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 52 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగంలో ముగ్గురికి చోటు

రాయచోటి టౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగంలో ముగ్గురికి చోటు కల్పించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీగా కొండూరు చెంగ్రాయుడిని నియమించింది. అలాగే రైతు విభాగం రాష్ట్ర సెక్రటరీగా ఓదివీటి రమణారెడ్డి, జాయింట్ సెక్రటరీగా సిమ్మసాని గంగిరెడ్డిలను నియమించినట్లు ప్రకటించింది.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం



కడప కోటిరెడ్డిసర్కిల్: ఈనెల 18 నుంచి 30వ తేది వరకు జరిగే పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు అన్ని పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో తమ నివాసం నుంచి పరీక్షా కేంద్రం వరకు, తిరిగి తమ నివాసం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని జిల్లా ప్రజా రవాణాధికారి పి.గోపాల్ రెడ్డి తెలిపారు. కేవలం పరీక్ష జరిగే రోజుల్లో మాత్రమే ఈ ఉచిత ప్రయాణ సౌకర్యానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని 183 పరీక్షా కేంద్రాల్లో 27,858 మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీపీపీ సీఈగా గౌరీపతి



ఎర్రగుంట్ల : డాక్టరు ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌గా గౌరీపతి నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్టీపీపీ సీఈ నాగరాజు విద్యుత్ సౌధ్‌కు బదిలీ అయ్యారు. విజయవాడలోని విద్యుత్‌సౌధ్‌లో జెన్‌కో పరిపాలన విభాగంగా పనిచేస్తున్న గౌరీపతిని ఆర్టీపీపీ సీఈగా నియమించారు. ఈమేరకు ఏపీజెన్‌కో యజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి



ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, సురేష్ బాబులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయచోటి టౌన్: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు సూచించారు. బుధవారం రాయచోటి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మండల స్థాయి నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజంపేట నాయకుడు గాలివీటి మదన్ మోహన్‌రెడ్డి (సాగర్ రెడ్డి), వీరబల్లి మండలంలోని సర్పంచ్‌లు నాగిరెడ్డి, గోపీనాథ రెడ్డి, వీరారెడ్డి, సుండుపల్లె నాయకులు అజయ్ రెడ్డి, అజంతమ్మ, మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, పింఛా రామస్వామి రెడ్డి, రెహిమాన్‌ఖాన్, రాయవరం రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందరర్భంగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, సురేష్ బాబులను సన్మానించారు.

నేటి నుంచి వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షలు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రథమ సెమిస్టర్ (రెగ్యులర్) ఆర్కిటెక్చర్ విద్యార్థులకు, 2వ, 3వ, 4వ సెమిస్టర్ పరీక్షలు కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులకు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'జపనీస్' అభ్యసనానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జపాన్ దేశంలోని ఆసుపత్రులలో కేర్ టేకర్స్‌గా పనిచేసేందుకు అర్హులైన ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన యువతీ యువకులకు జపనీస్ భాష నేర్పించేందుకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణను బెంగుళూరు నవీస్ హెచ్ఆర్ సెంటర్ లో ఆరు నెలలపాటు అందిస్తున్నామని పేర్కొన్నారు. కోర్స్ ఫీజు 3,50,000 రూపాయలు ఉంటుందన్నారు. దానిలో 25వేలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇస్తుందని, మిగిలిన మూడు లక్షల 25 వేలు శిక్షణ పొందే అభ్యర్థులు మూడు దశలలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 6 నెలల శిక్షణ అనంతరం జపాన్‌లోని ఆసుపత్రులలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9182869733 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

చిరుద్యోగుల చిద్విలాసం

ఇంతకాలం చాలీచాలని జీతాలతో చీకట్లో మగ్గిన చిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖలో అరకొర వేతనాలతో అష్టకష్టాలు పడుతున్న వారి బతుకులు మారుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న క్రమబద్ధీకరణ నిర్ణయం వందలాది మంది జీవితాలకు వెలుగు దారులు చూపనుంది.

- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం జగన్ ఉత్తర్వులు
- జీవితాంతం రుణపడి ఉంటామంటున్న ఉద్యోగులు
- చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో 272 మందికి మేలు



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు వైద్య ఉద్యోగులు (ఫైల్)

ఉమ్మడి చిత్తూరు జిల్లా: 152 మంది / ఉమ్మడి వైఎస్సార్ జిల్లా: 120 మంది



మదనపల్లె సిటీ: శుభ తరుణం రానే వచ్చింది. కాంట్రాక్టు బతుకులకు వెలుగు తెచ్చింది. రెండు దశాబ్దాల కల నెరవేర్చింది. వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తూ ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్న బడుగు ఉద్యోగుల కల ఫలించింది. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారి ఉద్యోగాలకు భరోసా కల్పించింది. జీఓ 30, జీఓ 31 ద్వారా వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్లు-మేల్, మల్టీ పర్పస్ వర్కర్లు-ఫీమేల్), గ్రేడ్-2 ఫార్మసిస్టుల ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తూ ఇటీవల జారీ చేసిన జీఓలు కాంట్రాక్టు ఉద్యోగులకు ఎనలేని సంతోషాన్ని తెచ్చి పెట్టాయి. ఈ శుభ తరుణం కోసం గత టీడీపీ ప్రభుత్వ హయంలో ఎన్నో పోరాటాలు చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ఎంతో మందిని కలిశారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరలేదని బాధపడ్డారు. తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉన్న ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు తీపి కబురు తీసుకొచ్చింది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ జారీ చేసిన జీఓ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది.

- ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీఓ ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 152 మంది పర్మినెంట్ అయ్యారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 120 మందిని పర్మినెంట్ చేశారు. ఇటీవల జారీ చేసిన జీఓలతో వీరి ఉద్యోగాలు పర్మినెంట్ అయ్యాయి. తమకు భరోసా ఇస్తూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు పట్టరాని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జీవితాలకు వెలుగులొచ్చాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన తీసుకున్న నిర్ణయాన్ని ఉద్యోగులందరూ స్వాగతిస్తున్నారు. మా ఆనందానికి అవధులు లేవు. పాదయాత్రలో ఇచ్చిన మాట ఎక్కడా తప్పలేదు. ఎంతో మంది పాలకులు వచ్చినా మా సమస్యలు ఆలకించలేదు. ఉద్యోగులంతా సీఎంకు రుణపడి ఉంటారు. -జి.చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఏ, పీహెచ్‌సీ, నిమ్మనపల్లె

కొత్త జీవితాన్ని ప్రసాదించారు



ఇరవై ఏళ్ల నుంచి ఎంతో మంది పాలకులు వచ్చారు. వెళ్లారు. కానీ మా వెతలు తీర్చలేదు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ నెరవేరుతుందా! లేదా! అనే సందేహంలో ఉన్నాం. ఆ హామీని జగనన్న తు.చ తప్పకుండా నెరవేర్చారు. మాకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. -పి.సోమాచారి, పీహెచ్‌సీ, చెంబకూరు,మదనపల్లె మండలం

ఎంతో రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్ల ఎదురు చూపులు ఇంత కాలానికి ఫలించాయి. ఇప్పటి వరకూ ఎన్నో ఇబ్బందులు పడ్డాం. చాలీచాలని జీతంతో పని చేశాం. మా జీవితాలకు ఒక దశ, దిశ నిర్దేశించిన మహానుభావుడు జగన్‌మోహన్‌రెడ్డి. మా కుటుంబం అంతా ఆయనకే తోడుగా నిలుస్తాం. ఉద్యోగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. ఈ ఆనందాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు. -ఖాదర్‌బాషా, ఎంపీహెచ్‌ఏ, పీహెచ్‌సీ, ములకలచెరువు

నిరీక్షణ ఫలించింది



ఇరవై ఏళ్ల నిరీక్షణ సీఎం జగన్ చొరవతో ఫలించింది. మేమంతా పట్టరాని ఆనందంలో ఉన్నాం. జగన్ రుణం తీర్చుకునే అవకాశం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ఇంకా ఎంతో మంది జీవితాలకు వెలుగులు వస్తాయి. -తేజోమూర్తి, ఎంపీహెచ్‌ఏ, కందుకూరు

ప్రశాంత ఎన్నికలకు కృషి చేయండి

- కలెక్టర్లు, ఎస్పీలకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసీలు

రాయచోటి: ఎలాంటి హింసాత్మక సంఘటనలు, రీపోల్‌కు చోటు లేకుండా స్వేచ్ఛాయుత ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. బుధవారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి 2024 సాధారణ ఎన్నికల నిర్వహణ, సంసిద్ధత, చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై ఆయన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషేక్‌కిషోర్, ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు హాజరయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయగానే ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలని ఎన్నికల అధికారి సూచించారు. నగదు, మద్యం రవాణా, మెటల్ వస్తువుల రవాణాపై నిఘా పటిష్టం చేయాలన్నారు. ఎంసీసీ, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్టీ బృందాల కార్యక్రమంపై నిర్దేశిత నమూనాలో రోజువారి నివేదికలను పంపాలని చెప్పారు. కలెక్టర్లు, ఎస్పీలు నిరంతరం పనిచేసేలా కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి వాటి గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. మీడియాలో రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, ఓటరు కార్డుల ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై ముఖ్య ఎన్నికల అధికారి కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ సత్యనారాయణరావు, ఎస్‌టీసీ వెంకట సుబ్బయ్య, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెంచురీ రెండో ప్లాంట్ రెడీ

- నేడు ఉత్పత్తి ప్రారంభం
- తొలి బోర్డును అందుకోనున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేశవ బజాంకా
- స్థానికులకు 2076 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు



సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ

సాక్షి ప్రతినిధి, కడప: బద్వేల్ సమీపంలో సెంచురీ ఫైబోర్డ్స్ సంస్థ ఆచరణలోకి వచ్చింది. తొలిదశ ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభం కాగా, రెండవ దశ ప్లాంట్ ఉత్పత్తి గురువారం ప్రారంభం కానుంది. తొలి ఫైబోర్డ్‌ను ఆ సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేవశ బజాంకా అందుకోనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం మేరకు నిర్ణయిత గడువు కంటే ముందే ఉత్పత్తి ప్రారంభించారు. వెరసి ఆ సంస్థ ద్వారా స్థానికులకు ఉద్యోగాలు, మెట్ట ప్రాంత రైతులకు కల్పతరువు దక్కనుంది.

- పారిశ్రామిక ప్రగతి సాధించాలనే కృతనిశ్చయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. తొలి రెండేళ్లు కరోనా వైరస్ కారణంగా ఆశించిన వృద్ధి లేకపోయింది. అవకాశం ఉన్న మేరకు పారిశ్రామిక ప్రగతి సాధించేందుకు తగ్గ ప్రణాళిలు రచించి సక్సెస్ అయ్యారు. పెట్టుబడులను సమకూరుస్తూనే, పారిశ్రామికవేత్తలకు అనువుగా మౌళిక సదుపాయాలు కల్పించారు. అందుకు చక్కటి ఉదాహరణగా గోవపరం సమీపంలో నిర్మించిన సెంచురీ ఫైబోర్డ్స్ సంస్థ నిలుస్తోంది. ఈ సంస్థ నిర్మాణానికి 2021 డిసెంబరు 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. వెంటనే పరిశ్రమకు అవసరమైన మౌళిక సదుపాయాలపై దృష్టి సారించారు. బ్రహ్మంసాగర్ నుంచి 0.07టీఎంసీ నీరు సరఫరాకు అవసరమైన అనుమతులిచ్చి రూ.45కోట్లతో పైపులైన్ 6 నెలల్లో పూర్తి చేశారు. మరో రూ.19.1 కోట్లతో 132కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. సకాలంలో ప్రభుత్వం మౌళిక వసతులు కల్పించడంతో అంతే స్ఫూర్తితో యాజమాన్యం నిర్మాణ వేగాన్ని పెంచింది. దాంతో ఒకరిద్దరికి కాదు, 2076 మంది స్థానికులకు ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. 2662 మంది ఉద్యోగాలు అవసరమైతే, ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 75 శాతం స్థానికులకు ఇవ్వాల్సి ఉండగా, 78శాతం ఉద్యోగాలు స్థానికులకు చైర్మెన్ సజ్జన్ భజాంకా అవకాశం కల్పించారు.

హంసవాహనంపై ఊరేగిన భద్రకాళీ సమేతుడు



హంసవాహనంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

రాయచోటి టౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి హంసవాహనంపై ఊరేగారు. బుధవారం బ్రహ్మోత్సవాలలో భాగంగా రాత్రి మూల విరాట్ స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన తరువాత ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించిన తరువాత బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, రంగురంగుల పూలతో అందంగా అలంకరించి హంసవాహనంపై ఉంచి ఆలయ మాఢవీధులు, పురవీధులలో ఊరేగించారు. ఈ ఉత్సవం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు.

నిరుపేదల నేస్తం!

- పేద మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
- 45-60 ఏళ్లలోపుగల మహిళలు స్వయంశక్తితో రాణించేలా ప్రోత్సాహం
- వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద మూడో విడత 23,287 మందికి రూ. 34.93 కోట్లు
- ప్రతి ఏడాది రూ. 15 వేలు అందిస్తున్న జగన్ సర్కార్
- నేడు నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి నిధులను విడుదల చేయనున్న సీఎం



వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	నిధులు (రూ. కోట్లు)
2021-22	21,272	31.90
2022-23	24,713	37.08
2023-24	23,287	34.93

సాక్షి రాయచోటి: అగ్రవర్ణాల్లోని పేద మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు మహిళలు స్వయంశక్తితో రాణించేలా వారిని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఈబీసీ నేస్తం పథకం ద్వారా ఆర్థికంగా చేయూతనందిస్తోంది. నేడు నంద్యాల జిల్లా బనగానపల్లెలో సీఎం బటన్ నొక్కి నిధులు విడుదల చేయనున్నారు.

నిరుపేదలకు ఆలంబన




రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా అగ్రవర్ణాల్లోని నిరుపేద మహిళలకు ఆర్థిక ఆలంబన ఇస్తున్నారు. ప్రత్యేకంగా నిరుపేద మహిళలు కూడా స్వయం ఉపాధితో ఆర్థికంగా స్థిరపడాలని సంకల్పించారు. అన్న మయ్య జిల్లాలో ఏడాదికేడాదికి లబ్ధిదారుల సంఖ్య పెరుగుతున్నా నిధుల విషయంలో పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తున్నారు. చాలామంది మహిళలు ఈ సొమ్ముతో చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

- రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. మరో పక్క స్వయం ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రోత్సహిస్తోంది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూతలతో పాటు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాల ద్వారా మహిళలను ఆదుకుంటోంది. ఒక్క పథకాల ద్వారానే కాకుండా రాజకీయ, ఇతర పదవుల్లోనూ పెద్దపీట వేసిన జగన్ సర్కార్ అగ్రవర్ణ మహిళలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద అకౌంట్లలో జమ చేయనుంది.

మూడో విడత 23,287 మందికి ప్రయోజనం

అన్నమయ్య జిల్లాలో మూడో విడత వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద మొత్తాలను జమ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. అందులో భాగంగా జిల్లాలోని 23,287 మందికి రూ. 34.93 కోట్లు మొత్తాన్ని గురువారం జమ చేయనున్నారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం తొలి విడతకు సంబంధించి 2021-22లో 21,272 మంది మహిళలకు రూ. 31.90 కోట్లను అందజేశారు. 2022-23లో 24,713 మంది మహిళలకు రూ. 37.08 కోట్లను అందించారు. అగ్ర వర్ణాల్లోని పేద మహిళలకు ఏడాదికి రూ. 15 వేలు చొప్పున మూడు విడతల్లో రూ. 45 వేలు అందించనున్నారు. మూడో విడతలో జిల్లాలోని 23,287 మంది మహిళలకు ప్రయోజనం చేకూరనుంది.

మహిళలకు ఆర్థిక భరోసా



జిల్లాలో అగ్రవర్ణాల్లోని పేద మహిళలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తోంది. అర్హులైన మహిళలందరికీ మూడో విడతలో ఆర్థికసాయం అందించనుంది. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే సొమ్మును సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలి. రాయచోటిలోని స్పందన హాలులో గురువారం ప్రత్యేక సమావేశం ద్వారా మహిళలకు నిధులు విడుదల చేయనున్నాం. -అభిషిక్త్ కిశోర్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

ల్యాప్ ట్యాప్‌లు చోరీ

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని కే బోయినపల్లిలో ఇంజినీరింగ్ విద్యార్థులు నివాసం ఉంటున్న అద్దె గదుల్లో 4 ల్యాప్ ట్యాప్‌లు చోరీకి గురయ్యాయి.ఈమేరకు విద్యార్థులు మన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్ రవీంద్ర నాథ్ సిబ్బందితో కలిసి అద్దె గదులను పరిశీలించారు.దర్యాప్తు చేపట్టామని, విద్యార్థులకు న్యాయం చేస్తామని ఆయన తెలియజేశారు.

బైక్ చోరీ పై కేసు నమోదు

మదనపల్లె : బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. రామారావు కాలనీకి చెందిన సయ్యద్ దాదా పీర్ కుమారుడు ఎస్ మస్తాన్ (30), ఈనెల 4వ తేదీన తన ఇంటి ముందు రూ.1.9 లక్షలు విలువ గల రాయల్ ఎన్‌ఫీల్డ్(ఏపీ 03జి యూ 7181) నెంబర్ గల బైక్ చోరీకి గురి అయింది. బాధితులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో 12వ తేదీ మంగళవారం సాయంత్రం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చిట్టీల నిర్వాహకులపై..

మదనపల్లె : పట్టణంలో రెండురోజులుగా కొనసాగుతున్న చిట్టీల మోసం వ్యవహారంలో బాధితుల ఫిర్యాదు మేరకు నిర్వాహకులపై కేసు నమోదుచేసినట్లు సీఐ వలీబాషు తెలిపారు. బుధవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ఎయిర్‌టెల్ సుధాకరరెడ్డి ఆరునెలలుగా చిట్టీలు వేసిన వారికి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని గాంధీపురంకు చెందిన వై.విజయకుమారి ఇచ్చిన ఫిర్యాదుమేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్‌నెంబర్.71/2024, 420రెడ్‌విత్31ఐపీసీ, 66 ఏపీసీఎఫ్ఏ కింద చిట్టీల నిర్వాహకులైన వి.సుధాకరరెడ్డి, కృష్ణారెడ్డి, బాషాలను నిందితులుగా గుర్తించి కేసు నమోదుచేశామన్నారు. చిట్టీలు వేసి మోసపోయామని, ఇప్పటివరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు 55 మంది బాధితులు రావడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే... వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే కేసులో నమోదుచేస్తామన్నారు. పట్టణ ప్రజలు తమ కష్టార్జితాన్ని అన్ రిజిస్టర్డ్ చిట్స్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

మతవిద్వేషాలను రెచ్చగొట్టడం బీజేపీ నైజం


మాట్లాడుతున్న నరసింహులు

రాయచోటి అర్బన్ : మత విద్వేషాలను రెచ్చగొట్టడం, తద్వారా తమరాజకీయ పబ్బం గడుపుకోవడం బీజేపీ నైజమని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన లౌకిక భారతాన్ని విచ్చినం చేసేందుకు వినాశకర పౌరసత్వచట్టం సవరణ -2019ని మోదీ ప్రభుత్వం మళ్లీ ముందుకు తేవడం మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకే అని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లానేతలు సాంబశివ, సుధీర్‌కుమార్, సమితి సభ్యుడు జక్కల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం..ధ్వజావరోహణం


వీరభద్రస్వామికి వసంతోత్సవం జరుపుతున్న వేదపండితులు


ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు

రాయచోటిటౌన్ : శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఎంతో ధ్వజావరోహణం నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం జరిపారు. ఉదయం యాగశాలలో మహా పూర్ణాహుతి జరిపారు. ఉదయం 10-30 గంటలకు వేదపండితులు ప్రణవానందగిరి (నర్రా వెంకట భాస్కర్ సిద్ధాంతి) ఆధ్వర్యంలో ఉదయం యాగశాలలో రుత్వికలు యజ్ఞం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు సమర్పించిన పట్టువస్త్రాలను మహాపూర్ణాహుతిగా ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి చేతుల మీదుగా యజ్ఞంలో సమర్పించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం కట్టుబడిగా (కట్టబడిన కంకణాలు) భక్తజనులతో కలసి కంకణ విసర్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అక్కడే నవధాన్యాలతో ఉంచిన కుప్పట్లు (మొలకొత్తిన మొలకలు) యాగశాల నుంచి తీసుకొచ్చి ఆలయంలో ఉంచారు. చివర్లో గంధం, కంకుమ, పసుపు కలిపిన నీళ్లతో వసంతోత్సవం కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

జగన్ పాలనలో ఆలయాలకు మహర్దశ



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, కార్మికశాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్‌లాల్, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల కలెక్టర్లు అభిషిక్త్ కిషోర్, విజయరామరాజు

సంబేపల్లె : జగన్న పాలనలో ఆలయాలకు మహర్దశ కల్గిందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు అన్నారు. బుధవారం జరిగిన సంబేపల్లె మండలం, శెట్టిపల్లె పెద్దబిడికిలో రూ.25 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా జరిగిన పూజలలో కార్మిక శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్ లాల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గొర్ల ఉపేంద్ర రెడ్డి, గొర్ల రమేష్ రెడ్డి తదితరులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి, నాయకులకు జిల్లా దేవదాయశాఖ శాఖ అధికారి విశ్వనాథ్, సర్పంచ్ వెంకటరమణ నాయక్, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఆలయాల నిర్మాణాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అపర శ్రీకృష్ణ దేవరాయులుగా సీఎం జగన్ పేరొందారన్నారు. పెద్దబిడికిలోనే రూ. 26 లక్షలతో మారెమ్మ ఆలయ ప్రాకారం, ఫ్లోరింగ్ నిర్మాణాలను పూర్తి చేసినట్లు చెప్పారు.నేడు రూ. 25 లక్షల నిధులతో రామాలయ నిర్మాణం పూర్తయి, విగ్రహ ప్రతిష్ఠ జరగడం హర్షణీయమని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా తిరుమల శ్రీవాణి ట్రస్టు ద్వారా 76 వేల ఆలయాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తిరుపతి లేబర్ ఆఫీసర్ బాలూ నాయక్, దేవాదాయశాఖ ఈఓ కొండారెడ్డి, సర్పంచ్ అంచలరామచంద్ర, నాయకులు వివి ప్రతాప్ రెడ్డి, కాంట్రాక్టర్ పప్పిరెడ్డి సహదేవరెడ్డి, మాజీ సర్పంచ్ దేవపట్ల వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ నాయక్, శివశంకర్ యాదవ్, తిరుపాల్ నాయక్, వాయల్పాటి ఆనందకుమార్ రెడ్డి, కిషోర్ రెడ్డి, అంజనేయులు నాయుడు, శంకర్ నాయుడు, మహేశ్వర తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

పాడి ఆవులు ఇప్పించండి సారూ

డీఎస్పీకి బాధిత మహిళ మొర


డీఎస్పీ కార్యాలయం ఆవరణలో పాడిఆవులును ఇప్పించాలంటూ వేడుకుంటున్న కళావతమ్మ

మదనపల్లె : ఉన్న ఊళ్లో ఉపాధి కరువై, బెంగళూరుకు వలస వెళుతూ, పాడిఆవులను అమ్మడం ఇష్టంలేక ఉన్న ఊళ్లో తెలిసిన వారికి అప్పగించి వెళితే.. తిరిగి వచ్చాక ఆవులను ఇవ్వకపోగా, తమపైనే దౌర్జన్యానికి పాల్పడుతూ అన్యాయం చేస్తున్నాడని ఓ మహిళ వాపోయింది. న్యాయం కోసం ఏడాదికాలంగా డీఎస్పీ, రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగుతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. బాధిత మహిళ తెలిపిన మేరకు...మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం గజ్జెలవారిపల్లెకు చెందిన కళావతమ్మ ఉపాధి కోసం బెంగళూరుకు వలసవెళ్లాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో డ్వాక్రా గ్రూపులో తీసుకున్న రూ.5లక్షల రుణంతో కొనుగోలు చేసిన 4పాడి ఆవులను గ్రామానికి చెందిన కాప్పల్లె రాజప్పకు అప్పగించి వెళ్లింది. అతడు వాటిని మేపుకుంటూ, వాటి నుంచి వచ్చిన పాలను విక్రయించుకుని ఆదాయం పొందేవాడు. కొన్నాళ్ల తర్వాత స్వగ్రామానికి చేరుకున్న కళావతమ్మ...రాజప్పను కలిసి తమ పాడిఆవులను అప్పగించాలని కోరితే అందుకు ఆయన నిరాకరించి, దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. ఈ విషయమై అప్పట్లో రామసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు తెలిసింది. పోలీసులు రాజప్పను విచారించినప్పటికీ, తనకు న్యాయం చేయలేదన్నారు. దీంతో ఏడాదికాలంగా మదనపల్లె డీఎస్పీ కార్యాలయం, రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూనే ఉన్నట్లు తెలిపింది. తాడేపల్లిగూడెంకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదర్బార్‌లోనూ ఫిర్యాదుచేయడమే కాకుండా అన్నమయ్యజిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లడం జరిగిందన్నారు. పోలీస్ అధికారులు తనను వారిని కలిసినప్పుడల్లా తప్పన న్యాయం చేస్తామని చెపుతున్నారే తప్ప ఇప్పటివరకు చేసిన దాఖలా లేదన్నారు. గ్రామంలో రచ్చబండ వద్ద పెద్దమనుష్యులు జరిపిన పంచాయతీలో కాప్పల్లె రాజప్ప ఆవులు తోలుతానని అంగీకరించి, ఇప్పుడు సంబంధం లేదంటున్నాడని వాపోయింది.పాడిఆవులే తనకు జీవనాధారమని, వాటిని ఇప్పించాలని వేడుకుంది.

జ్యూస్ అనుకుని పురుగుల మందు తాగిన విద్యార్థి

మదనపల్లె : పొరపాటున ఓ విద్యార్థి జ్యూస్ అనుకొని పురుగుల మందు తాగిన సంఘటన బుధవారం మదనపల్లి మండలంలో జరిగింది. సీటీఎం పంచాయతీ కమలానగర్ కు చెందిన రమణ కుమారుడు ఎర్రబెల్లి మహేష్(15), స్థానికంగా పదోతరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం ఇంటి వద్ద బాటిల్‌లో ఉన్న పురుగుమందును జ్యూస్ అనుకుని తాగాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు లోనవగా, కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

పట్టపగలే విద్యార్థిపై బెల్టుదాడి


విద్యార్థిపై దాడి చేస్తున్న యువకులు

మదనపల్లె : పట్టణంలో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకీ శృతిమించిపోతున్నాయి. చిన్నచిన్న వివాదాలకే వీధి రౌడీల్లా రెచ్చిపోతున్నారు. పట్టపగలే.. అందరూ చూస్తుండగా కొందరు పాఠశాలల విద్యార్థులు పదోతరగతి చదువుతున్న విద్యార్థిపై బెల్టులు, కర్రలతో దాడిచేశారు. చుట్టుపక్కల వారు అడ్డగిస్తున్నా తీవ్రంగా కొట్టారు. అక్కడే వున్న కొంత మంది ఈ వీడియో తీసి వైరల్ చేయడంతో పోలీసుల దృష్టికి వెళ్లింది. వివరాల్లోకి వెళితే మదనపల్లె మండలం జంగాలపల్లెకు చెందిన ఓ విద్యార్థి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్లో టెన్త్ చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్కూలు వదిలేశాక ఐదుగంటల సమయంలో స్థానిక మెట్రోకాం ఫ్లెక్స్ వద్ద టీ తాగుతున్న విద్యార్థినిని ముగ్గురు యువకులు వచ్చి అడ్డగించారు. హఠాత్తుగా బెల్టులు, కర్రలు తీసి వీపుపై కొట్టారు. స్థానికులు ఈ దాడిని అడ్డుకుంటున్నా వారు లెక్కచేయలేదు. ఈ తంతును స్థానికులు వీడియో తీసి వైరల్ చేయడంతో విషయం టూ టౌన్ సీఐ యువరాజు దృష్టికి వెళ్లింది. దీనిపై స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంను, ఉపాధ్యాయులను విద్యార్థి గురించి ఆచూకి తీశారు. దాడి చేసిన ముగ్గురు యువకులు స్థానిక రామారావుకాలనికి చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. సీఐ యువరాజు మాట్లాడుతూ బాధితుడి నుంచి తమకు ఫిర్యాదు అందలేదని, విచారించి, చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు రెండు ప్రాజెక్టుల ఎంపిక


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న చిత్తూరు జిల్లా డీఈఓ దేవరాజు

రాయచోటి : జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు అన్నమయ్య జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కలకడ మండలం, ఎర్రయ్యగారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రుక్సానా రూపొందించిన స్పీడ్స్ పోయింగ్ మెషిన్, కలికిరి మండలం సైనిక్ పాఠశాలకు చెందిన నిహాల్ కృష్ణ రూపొందించిన రిమోట్ కంట్రోల్ ఫీల్డ్ స్మోకర్ అను ప్రాజెక్టులు జాతీయస్థాయికి ఎంపికయ్యాయన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన ఇద్దరు విద్యార్థులు చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు నిర్వహించారన్నారు. రాష్ట్రస్థాయి నుంచి 306 ప్రాజెక్టులు ప్రదర్శించగా అందులో 24 ప్రాజెక్టులు జాతీయస్థాయికి ఎంపిక చేశారన్నారు. విద్యార్థులను, వారిని గైడ్ చేసిన ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి, సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డిలు అభినందించారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపు రేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



మాది రైల్వేకోడూరు మండలం రాజీవ్ గిరిజన కాలనీ, మేము ఎంతో కాలంగా పూరింటిలో నివాసం ఉంటున్నాం. ఎండకు, వానకు తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొన్నాం. పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్నాం. ప్రభుత్వం 1.5 సెంటు స్థలం ఇచ్చింది. అందులో ఇళ్లు నిర్మించుకోవడానికి 1.80 వేలు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల సొంతింటి కల నెరవేరింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – నిడిగింటి లీలావతి, రాజీవ్‌గిరిజన కాలనీ, కోడూరు.

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్కరూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వలంటీర్ ద్వారా తీసుకున్నా. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. అయినా సకాలంలో వచ్చేవి కావు. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకుంటే స్థానిక సచివాలయంలోనే దొరుకుతున్నాయి. అంతేకాకుండా డిగ్రీ చదువుతున్న నాకు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన అందుకోవడం జరిగింది. ఇంత మంచి పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణపడి ఉంటాం. – మిరియాలవీరభద్రుడు, కాలువపల్లె, గోపవరం మండలం

మొల్లమాంబకు ఘన నివాళి


మొల్లమాంబ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ బి కృష్ణారావు, పోలీసు అధికారులు

రాయచోటి : స్త్రీలపట్ల సమాజంలో ఉన్న వివక్షను ఛేదించుకొని వెలుగుచూసిన నారీమణి కవయిత్రి మొల్లమాంబ అని జిల్లా ఎస్పీ బి కృష్ణారావు అన్నారు. బుధవారం మొల్లమాంబ జయంతి సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రామాయణ మహా గ్రంథ తెలుగు అనువాదిగా మొల్లమాంబ కీర్తి గడించారని ఎస్పీ కొనియాడారు. కవయిత్రి మొల్లను ఆదర్శంగా తీసుకొని ఆమె ఆశయ సాధనకోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఏఓ కృష్ణుడు, సీఐలు భాస్కర్, చంద్రశేఖర్, ఉమా మహేశ్వర రావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

- సకల గుణాభిరాముడు శ్రీరాముని చరితమును సరళంగా రాసిన ఘనత కవయిత్రి మొల్లమాంబదని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సందప్ప ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతి వేడుకలు రిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డీఆర్‌ఓ సత్యనారాయణ హాజరై పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన రఫీ

పెద్దతిప్పసముద్రం : స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం, బొలేరో వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న కర్ణాటక రాష్ట్రం ఎనుములపాడి గ్రామానికి చెందిన రఫీ (47) తలకు గాయమై తీవ్ర గాయమైంది. స్థానికులు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ద్విచక్ర వాహనదారుడు అతిగా మద్యం సేవించడంతో పాటు వెనుక నుంచి బొలేరో వాహనాన్ని ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

మదనపల్లె : బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకా కైవారం కు చెందిన సబ్జాన్ కుమారుడు సయ్యద్ హుస్సేన్ (55) ద్విచక్ర వాహనంలో కురబలకోట మండలం అంగళ్లుకు వెళ్తుండగా, మార్గమధ్యంలోని విశ్వం కాలేజీ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. స్థానికులు అతన్ని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మదనపల్లె : దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎన్. శేఖర్ తెలిపారు. మండలంలోని దుబ్బిగాని పల్లి పంచాయతీ గొల్లపల్లి కి చెందిన పూజారి శ్రీనివాసులు (47)పై, అదే గ్రామానికి చెందిన చంద్రమోహన్, చంద్రశేఖర్,ప్రసన్నకుమార్, హేమావతి, మమత, ఆనంద్‌లు సోమవారం రాత్రి దాడి చేసి గాయపరచారన్నారు. దాడిలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడగా స్థానికులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారన్నారు. భూమి దున్నకానికి సంబంధించి రూ.20 వేలు సంబంధించి వారి మధ్య గొడవ జరిగిందన్నారు. బాధితు ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల -కడప రైలు మార్గంలో వెళ్లే హూబ్లీ రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఓ ప్రయాణుకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజారామిరెడ్డి బుధవారం తెలిపారు. పూర్తి వివరాల కోసం విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 55 ఉంటుందని తెలిపారు.

భర్తను హత్యచేసిన భార్య

ఓబులవారిపల్లె : అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట పునారావాస కాలనీ -1లో బుధవారం తెల్లవారుజామున బోయ తిమ్మప్ప(40) అనే వ్యక్తిని భార్య నరసమ్మ హత్య చేసింది. పోలీసుల కథనం మేరకు కర్నులు జిల్లా ఎమ్మిగనూరు గ్రామనికి చెందిన బోయ తిమ్మప్పకు మంగంపేట గ్రామానికి చెందిన నరసమ్మతో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. పునరావాస కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్య నరసమ్మ మంగంపేటలోని ఏపీఎండీసీలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తుంది. మృతుడు తిమ్మప్ప బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా తాగి వచ్చాడు. ఈవిషయంపై భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఆవేశంతో పక్కన ఉన్న ఇనుప రాడ్డు తీసుకుని తిమ్మప్ప తల పై పలు మార్లు దాడి చేసింది. దీంతో తీవ్రగాయమై అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.ఎస్ఐ చిన్న పెద్దయ్య నరసమ్మను అదుపులోకి తీసుకుని విచారించగా తనే హత్య చేసినట్లు అంగీకరించింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రైల్వేకొడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

ఐదుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని చంద్ర కాలనీకి చెందిన రామచంద్ర భార్య రెడ్డమ్మ (25) కుటుంబ సమస్యల కారణంగా పురుగుమందు తాగింది. నీరుగట్టువారిపల్లె బయ్యారెడ్డి కాలనీ 8వ క్రాస్‌కు చెందిన రమణ భార్య అంజనమ్మ (40), కుటుంబ సమస్యలతో యాసిడ్ తాగింది. కోళ్ల బైలు పంచాయతీ వైయస్సార్ కాలనీకి చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు ఆర్. మనోహర్ రెడ్డి (40), కుటుంబ సమస్యలతో చీమల మందు తాగాడు. పట్టణంలోని బాపన కాల్వకు చెందిన చంద్రశేఖర్ భార్య మమత (40), కుటుంబ సమస్యలతో బొద్దింకల నివారణ మందు తాగింది.మండలంలోని కోటవారిపల్లెకు చెందిన నాగరాజు భార్య సుబ్బమ్మ (40), బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన తన తల్లి అంత్యక్రియలకు హాజరైంది. ఇంటికి వచ్చిన ఆమె తీవ్ర మనస్థాపానికి గురై పిడుదుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఏప్రిల్‌లో వైవీయూ స్నాతకోత్సవం

వైవీయూ : యోగివేమన విద్యాలయం స్నాతకోత్సవం నిర్వహణకు సిద్ధమవుతున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ వెల్లడించారు. ఇందులో భాగంగా బుధవారం రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డితో కలిసి విశ్వవిద్యాలయంలో వేదిక నిర్మాణానికి అనువైన స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయం 11, 12, 13వ కాన్వకేషన్ (2020-21, 2021-22, 2022-23) ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2023 విద్యా సంవత్సరానికి ముందు ఉత్తీర్ణులైన విద్యార్థులు స్నాతకోత్సవ వేడుకలో పట్టాలు పొందేందుకు ఈనెల 21వ తేదీలోపు ఆన్‌లైన్‌లో కాన్వొకేషన్.వైవీయూఎగ్జామ్స్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో సందేహ నివత్తి కోసం హెల్ప్ లైన్ సెంటర్ (9705812613)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వందశాతం లక్ష్యసాధనకు కృషిచేయాలి


రికార్డులను పరిశీలిస్తున్న రియాజ్‌బేగ్

రాయచోటి అర్బన్ : అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో వందశాతం లక్ష్యాలను సాధించాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి (డీపీఎంఓ) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. జాతీయవ్యాధి నిరోధక టీకాల అమలు, జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల పర్యవేక్షణలో భాగంగా ఆయన బుధవారం రాయచోటి మున్సిపల్ పరిధిలోని వాల్మీకి వీధి పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఎన్‌సీడీ, సీడీ సర్వే, ఆరోగ్యశ్రీలోని ఎస్ఎం ఫీడ్‌బ్యాక్ తదితర అంశాలపై సమీక్షించారు. వందశాతం లక్ష్యసాధనకు కృషి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం డ్రగ్‌స్టోర్స్‌ను పరిశీలించి బిన్‌కార్డ్స్ స్టాక్‌తో సరిచూశారు. ఈ సందర్భంగా ఫార్మాసిస్ట్‌కు తగిన ఆదేశాలు జారీచేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం దేశ ప్రధాని నరేంద్రమోదీ పీఎం-సూజర్ జాతీయ పోర్టల్ లాంచ్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 510 జిల్లాలకు చెందిన వివిధ పథకాల లబ్ధిదారులతో దూరదర్శన్‌లో వర్చువల్ విధానంలో ముఖాముఖి నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్‌హుస్సేన్, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, యూబీఐ రీజనల్ మేనేజర్ భాస్కర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లాలో 1270 మంది లబ్దిదారులకు సంబంధించి సబ్సిడీ రుణాలు రూ.15.40 కోట్లకు సంబంధించిన చెక్కులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు.